
janodaya
# జనోదయ
WWW.JANODAYA.COM
కరీంనగర్ మంగళవారం 27.01.2026 సంపుటి:03 సంచిక:54 పేజీలు:08 వెల : 05
Karimnagar Tuesday 27.01.2026 Volume : 03 Issue : 53 Pages : 08 Cost : 05
తెలుగు దినపత్రిక

## అడవిని వీడిన తుపాకీ.! భర్త మరణంతో కుంగుబాటు




## మెదక్ జిల్లాలో బీజేపీకి అభ్యర్థుల కరువు

**ఉమ్మడి మెదక్ జిల్లాలో**
**బీజేపీకి ఒక ఎంపీ, ఎమ్మెల్సీ**
**జిల్లాలో పార్టీ**
**ఉనికి సంగతేంటన్న చర్చలు**
**సర్పంచ్ ఎన్నికల టైంలో**
**నాయకత్వ తీరుపై కేడర్ ఆగ్రహం**
**సంగారెడ్డి జిల్లాలో 11, మెదక్‌లో 4,**
**సిద్దిపేటలో 5 మున్సిపాలిటీలు**




**హైదరాబాద్, (జనోదయ):**
ఆ జిల్లాలో బీజేపీకి బడా నేతలున్నా...మున్సిపల్ ఎన్నికల్లో పోటీకి అభ్యర్థులు కరవయ్యారా..? రా... రమ్మని పిలుస్తున్నా ఎవ్వరూ అటువైపు చూడ్డం లేదా? అందుకే పక్క పార్టీల్లో అసంతృప్తులవైపు చూస్తున్నారా? ఎక్కడ జరుగుతోందలా? కాషాయ పార్టీకి ఎందుకా కష్టం వచ్చింది?

..మిగతా 3లో

## గద్వాల్ కాంగ్రెస్ లో టికెట్ల కోసం పోటాపోటీ..




**గద్వాల కాంగ్రెస్‌లో ఒడవని పంచాయితీ**
**మున్సిపల్ టిక్కెట్ల కోసం పోటా పోటీ**
**పీఠంపై మా వాళ్ళే ఉండాలంటూ రెండు వర్గాల పట్టు**
**ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి బీఆర్ఎస్‌కు దూరమయ్యాక మారిన సీన్**

**హైదరాబాద్, (జనోదయ):**
ఆ నియోజకవర్గంలో కాంగ్రెస్ పంచాయితీ ఎప్పటికీ ఒడవని ముచ్చటేనా? మున్సిపల్ ఎన్నికల వేళ ఇద్దరు నేతల మధ్య వార్డుల వాటా వ్యవహారం మొదటికే మోసం తెస్తుందా? తగ్గేదేలే

..మిగతా 3లో

## కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత, అసంతృప్తి ఉంది


**ఈ విషయాన్ని పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకువెళతామన్న కోదండరాం**
**మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేస్తామన్న కోదండరాం**
**కాంగ్రెస్ పార్టీతో పొత్తుపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని స్పష్టీకరణ**




## 57 బంతుల్లోనే 100 పరుగులు...

**డబ్ల్యూపీఎల్ చరిత్రలో తొలి సెంచరీ బాదిన నాట్ సివర్ బ్రంట్**
**57 బంతుల్లో 100 పరుగులతో అజేయంగా నిలిచిన సివర్**
**హేలీ మాథ్యూస్‌తో కలిసి 131 పరుగుల భారీ భాగస్వామ్యం**
**ఆర్సీబీకి 200 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించిన ముంబై**




## అప్పుడు బీఆర్ఎస్.. ఇప్పుడు కాంగ్రెస్

### కౌన్ బనేగా సృజన్ రెడ్డి

**రాష్ట్ర రాజకీయాల్లో వివాదాలన్నీ ఆయన చుట్టే**
**ఆనాటి బీఆర్ఎస్ హయాంలోనూ కీలక వ్యక్తే**
**ఇప్పుడు కాంగ్రెస్ లో కూడా ఆయనదే హల్ చల్**
**లిక్కర్ స్కాంలో కూడా నిందితుడు**
**బీఆర్ఎస్ ఎందుకు విమర్శలు చేస్తోంది..?**



**హైదరాబాద్, (జనోదయ):**
రాష్ట్ర రాజకీయాలన్నీ ఇప్పుడు రెండు అంశాలపైనే సాగుతున్నాయి. ఒకటి ఫోన్ ట్యాపింగ్.. మరోకటి సింగరేణి స్కాం. వీటిపై విమర్శలు పదునెక్కాయి. అటు అధికారపక్షం కూడా ఎదురుదాడి చేస్తోంది. కానీ, ఈ రెండు పార్టీలకు ఒకే ఒక ఆయుధం.. సూదిని సృజన్ రెడ్డి. ఇప్పుడు అధికారంలో ఉన్న పార్టీకి.. సీఎంకు సన్నిహితుడు.. ఆయన కోసమే బొగ్గు స్కాం అంటూ బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. కానీ, సృజన్ రెడ్డి

..మిగతా 2లో

# దేశ ప్రతిష్ఠకు శక్తిమంతమైన ప్రతీక

**గణతంత్ర దినోత్సవ పరేడ్ జాతీయ గర్వానికి నిదర్శనమని ప్రధాని మోదీ అన్నారు**
**పరేడ్ మన ప్రజాస్వామ్య బలాన్ని, వారసత్వ సంపదను చాటిచెప్పిందని ప్రశంస**
**వేడుకల అనంతరం సంప్రదాయాన్ని పక్కనపెట్టి కర్తవ్యపథ్‌లో నడిచిన ప్రధాని**
**ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగిన మోదీకి ఘన స్వాగతం**
**భారత భద్రతా వ్యవస్థల శక్తిసామర్థ్యాలు అద్భుతమని కొనియాడిన ప్రధాని**



**న్యూ ఢిల్లీ, (జనోదయ):**
77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు దేశరాజధాని ఢిల్లీలో అంబరాన్నంటాయి. కర్తవ్యపథ్‌లో జరిగిన అద్భుతమైన పరేడ్ ముగిసిన అనంతరం, ఈ వేడుకలు "దేశ ప్రతిష్ఠకు శక్తిమంతమైన ప్రతీక" అని ప్రధాని నరేంద్ర మోదీ అభివర్ణించారు. ఈ మేరకు సోమవారం ఆయన సోషల్ మీడియాలో తన అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ వేడుకల ద్వారా భారతదేశ ప్రజాస్వామ్య బలం, సాంస్కృతిక వారసత్వ సంపద, దేశాన్ని

..మిగతా 3లో

## మాజీ ఎంపీ సంతోష్ రావుకు సిట్ నోటీసులు..!

**ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ మాజీ ఎంపీ సంతోష్‌రావుకు సిట్ నోటీసులు**
**నేడు మధ్యాహ్నం 3 గంటలకు విచారణకు రావాలని సంతోష్‌రావుకు ఆదేశం**
**బీఆర్ఎస్ పార్టీలో కీలక నాయకుడిగా ఉన్న సంతోష్ రావు**
**ఇప్పటికే కేటీఆర్, హరీష్‌రావును విచారించిన సిట్**



**హైదరాబాద్, (జనోదయ):**
హైదరాబాద్‌లో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తులో భాగంగా సిట్ (SIT) అధికారులు తాజాగా బీఆర్ఎస్ మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్‌రావుకు నోటీసులు జారీ చేశారు. పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో నమోదైన క్రైమ్ నంబర్ 243/2024 కేసు దర్యాప్తులో భాగంగా, ఈ వ్యవహారానికి సంబంధించిన కొన్ని కీలక వాస్తవాలు సంతోష్ రావుకు తెలిసి ఉండవచ్చని భావిస్తున్నట్లు పోలీసులు నోటీసులో

..మిగతా 2లో

## సంతోష్ కుమార్‌కు నోటీసులు.. రేవంత్ సర్కార్‌పై హరీశ్ రావు ఫైర్

**ఇవి రాజకీయ కక్ష సాధింపు చర్యలేనన్న హరీశ్ రావు**
**గవర్నర్‌ను కలవనున్న నేపథ్యంలోనే నోటీసులు ఇచ్చారని ఆరోపణ**
**ప్రజల దృష్టి మరల్చేందుకే కాంగ్రెస్ సర్కార్ కుట్ర చేస్తోందని విమర్శ**




## గవర్నర్‌ను కలవనున్న కేటీఆర్ బృందం

**సింగరేణి టెండర్లలో కుంభకోణం జరిగిందని బీఆర్ఎస్ ఆరోపణ**
**సీఎం, ఉప ముఖ్యమంత్రి, మంత్రుల పాత్ర ఉందని ఆరోపణ**
**గవర్నర్‌కు సాక్ష్యాధారాలతో కూడిన నివేదికను ఇవ్వనున్న కేటీఆర్ బృందం**



**హైదరాబాద్, (జనోదయ):**
తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం రేపు కలవనుంది. సింగరేణి వ్యవహారంపై వారు గవర్నర్‌కు సమగ్ర వివరాలు అందజేయనున్నారు. సింగరేణిలో భారీ కుంభకోణం జరిగిందని, ఇందులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, ఇతర మంత్రుల పాత్ర ఉందని ఆరోపిస్తూ వారు సాక్ష్యాధారాలతో కూడిన నివేదికను గవర్నర్‌కు

..మిగతా 2లో


## హార్వర్డ్ యూనివర్సిటీలో శిక్షణ తరగతులకు సీఎం రేవంత్

**హార్వర్డ్ యూనివర్సిటీలో విద్యార్థిగా మారనున్న సీఎం రేవంత్ రెడ్డి**
**'లీడర్‌షిప్ ఇన్ 21వ శతాబ్దం' కోర్సులో చేరిక**
**భారీ హిమపాతం, ప్రతికూల వాతావరణంలోనే తరగతులకు హాజరు**
**సీఎం అమెరికా పర్యటనపై ప్రతిపక్ష బీజేపీ విమర్శలు**
**ప్రజా బాధ్యతల కంటే వ్యక్తిగత ఆకాంక్షలకే ప్రాధాన్యతా? అని ప్రశ్న**




## బీజేపీకి బిగ్ షాక్.. పార్టీని వీడిన ఆరూరి రమేష్..

**బీజేపీని వీడిన మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్**
**బీజేపీ సభ్యత్వానికి రాజీనామా చేస్తూ అధ్యక్షుడికి లేఖ రాసిన ఆరూరి రమేష్**
**త్వరలో బీఆర్ఎస్‌లో చేరనున్న ఆరూరి రమేష్**


Office: 0870-2459811
Resi: 0870-2430275
Date:26-01-2026.
పత్రిక ప్రకటన
...జనతా పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా ...ను. నాకు ఇన్ని రోజులు సహకరించిన బీజేపీ ...నాయకులకు, కార్యకర్తలకు హృదయపూర్వక ...లు.
...ష్ట్ర సమితి అధిష్ఠానం ఆహ్వానం మేరకు నా ఇంటి ...ర్ఎస్ లోకి త్వరలో పలువురు నాయకులు, నా ...లు, అభిమానులతో కలిసి బీఆర్ఎస్ పార్టీలో భారీ ...రాలని నిర్ణయించుకున్నాను.
కృతజ్ఞతలతో
మీ
ఆరూరి రమేష్.



## కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత,
# అసంతృప్తి ఉంది



- ఈ విషయాన్ని పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకువెళతామన్న కోదండరాం
- మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేస్తామన్న కోదండరాం
- కాంగ్రెస్ పార్టీతో పొత్తుపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని స్పష్టీకరణ

**హైదరాబాద్, (జనోదయ):**

తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం కాంగ్రెస్ ప్రభుత్వంపై సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత, అసంతృప్తి నెలకొన్నాయని అన్నారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకువెళతానని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీతో పొత్తుపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని ఆయన స్పష్టం చేశారు. అధికార పార్టీకి తమ నిర్ణయాన్ని తెలియజేశామని పేర్కొన్నారు.
మున్సిపల్ ఎన్నికల అంశానికి సంబంధించి కాంగ్రెస్ పార్టీని సంప్రదించామని, ఆ పార్టీ నిర్ణయం కోసం వేచి చూస్తున్నామని ఆయన అన్నారు. తాము మాత్రం పోటీ చేయాలని నిర్ణయించుకున్నామని స్పష్టం చేశారు.
సింగరేణిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్క తెలంగాణ బిడ్డపై ఉందని కోదండరాం అన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ సింగరేణిని కార్పొరేట్ శక్తుల చేతిలో బందీ కానివ్వబోమని ఉద్ఘాటించారు. తాను కూడా ఫోన్ ట్యాపింగ్ బాధితుడినేనని ఆయన వెల్లడించారు. అక్రమంగా ఫోన్ ట్యాపింగ్ చేసినప్పుడు లేని భయం, విచారణ సమయంలో ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు.
అమరవీరుల త్యాగంతో సాధించిన తెలంగాణలో ప్రజలు పదేళ్లు అధికారమిస్తే బీఆర్ఎస్ ప్రభుత్వం అవినీతికి పాల్పడిందని ఆయన విమర్శించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ కుటుంబం తప్ప ఎవరూ బాగుపడలేదని దుయ్యబట్టారు. ప్రజా సమస్యల పరిష్కారంలో తెలంగాణ జన సమితి కార్యకర్తలు అంకితభావంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.
2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వడానికి మూడు కారణాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. కేసీఆర్ నిరంకుశ పాలన అంతం కావాలని, ఉద్యమ ఆకాంక్షల సాధన కోసం ఒక ప్రయత్నం జరగాలని, ప్రభుత్వంలో తమకు భాగస్వామ్యం ఉండాలని కోరుకున్నామని ఆయన అన్నారు. ఈ కారణాల వల్లే తామంతా కలిసి కాంగ్రెస్ ప్రభుత్వానికి మద్దతు పలికామని కోదండరాం తెలిపారు.

# అప్పుడు బీఆర్ఎస్.. ఇప్పుడు కాంగ్రెస్

మొదటిపేజీ తరువాయి

మాకంటే ఎక్కువ మీకే దగ్గర.. మీ హయాంలోనే లెక్కకు మించి కాంట్రాక్టులు ఇచ్చారంటూ కాంగ్రెస్ చెప్తోంది. దీంతో రాష్ట్ర రాజకీయాల్లో ఇప్పుడు వినిపిస్తున్న అత్యంత వివాదాస్పదమైన, ఆసక్తికరమైన పేరుగా సూదిని సృజన్ రెడ్డి పేరు మారింది. ప్రతీ దానికి సృజన్ రెడ్డి పేరును తెరపైకి తెస్తున్న బీఆర్ఎస్.. రేవంత్ పై ఆరోపణలు చేస్తోంది. కానీ ఈ సృజన్ రెడ్డి బీఆర్ఎస్ హయాంలోనే ఎక్కువ కాంట్రాక్టులు పొందారని కీలక అంశాలను కాంగ్రెస్ లోని ఓ వర్గం వెలుగులోకి తీసుకువస్తోంది.

**రెండు వైపులా అతడే**

సూదిని సృజన్ రెడ్డికి కేవలం ఒక వ్యాపారవేత్తగానే కాకుండా, అధికార పార్టీ ఏదైనా తన హవాను కొనసాగిస్తున్నట్లుగా తెలుస్తోంది. ఆయన బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డికి అల్లుడు కాగా, ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి భార్య వైపు నుంచి ఆయనకు బంధుత్వం ఉంది. ఇలా అటు ప్రతిపక్షం, ఇటు అధికార పక్షం రెండింటితోనూ ఆయనకు అత్యంత సన్నిహిత సంబంధాలు ఉన్నాయి.

**లిక్కర్ కేసులో వెలుగులోకి..**

సృజన్ రెడ్డి పేరు మొదట ఢిల్లీ లిక్కర్ స్కామ్ లో బయటకు వచ్చింది. ఈ కేసులో ఈడీ, సీబీఐ సోదాలు జరిగినప్పుడు ఆయన పేరు ప్రముఖంగా వినిపించింది. అప్పట్లో బీఆర్ఎస్ అగ్రనేతలకు అత్యంత సన్నిహితుడిగా, ఆ పార్టీ ఆర్థిక మూలాల్లో కీలక వ్యక్తిగా ఆయనపై ఆరోపణలు వచ్చాయి. రాజకీయ వర్గాల్లో కొందరు ఆయన్ని ఒక చిన్న చేపగా అభివర్ణిస్తే, మరికొందరు మాత్రం తెరవెనుక చక్రం తిప్పే "కింగ్‌పిన్" అని చెప్తున్నారు.

**బీఆర్ఎస్ లో కీలక ప్రాజెక్టులు**

కాంట్రాక్టుల పరంగా సృజన్ రెడ్డికి చెందిన సంస్థలు గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో భారీ ప్రాజెక్టులను దక్కించుకున్నాయి. ముఖ్యంగా మిషన్ భగీరథ, సాగునీటి ప్రాజెక్టుల్లో ఆయన సంస్థలు కీలక పాత్ర పోషించాయి. అప్పట్లో కేసీఆర్ ప్రభుత్వంతో ఉన్న సాన్నిహిత్యం వల్ల వేల కోట్ల విలువైన పనులు ఆయనకు దక్కాయని విపక్షాలు ఆరోపించేవి. అంతేకాకుండా బీఆర్ఎస్ లో కీలక నేతలకు సృజన్ రెడ్డి ఆర్థిక పరంగా బినామీగా ఉండేవాడని కూడా విమర్శలు వచ్చాయి. అటు ఆయన మామ ఎమ్మెల్యే కావడంతో గులాబీ పార్టీలో కీలక నేతలకు దగ్గరయ్యాడని టాక్.

**ఇప్పుడూ ఆయన వివాదమే**

అనూహ్యంగా ప్రభుత్వం మారిన తర్వాత కూడా సృజన్ రెడ్డి హవా తగ్గలేదు. రేవంత్ రెడ్డి సీఎంగా ఉన్న ప్రస్తుత కాలంలోనూ ఆయన కంపెనీలు కాంట్రాక్టుల్లో ఆయన చేతికే వస్తున్నాయి. ఏ పార్టీ అధికారంలో ఉన్నా, తన వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించుకోవడంలో ఆయన ముందున్నట్లు అర్థమవుతోంది. కానీ, బీఆర్ఎస్ ఇప్పుడు రేవంత్ ను టార్గెట్ చేయడానికి సృజన్ రెడ్డిని అస్త్రంగా వాడుకోవడమే సంచలనంగా మారింది. ఇప్పుడు రాజకీయాలకు, వ్యాపారాలకు మధ్య వారధిలా సృజన్ రెడ్డి ఉన్నట్లు స్పష్టమవుతోంది. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డికి స్వయానా అల్లుడు కావడంతో పాటు, ప్రస్తుత రేవంత్ రెడ్డి భార్య వైపు నుండి బంధువు కూడా కావడంతో, ఈ బంధుత్వాల చార్ట్ రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.






**బీఆర్ఎస్‌కు అదే అస్త్రం**

ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని టార్గెట్ చేయడానికి సృజన్ రెడ్డిని ఒక అస్త్రంగా వాడుకుంటోంది. తమ హయాంలోనే సృజన్ రెడ్డి అత్యధిక కాంట్రాక్టులు పొందినప్పటికీ, రేవంత్ రెడ్డితో ఉన్న బంధుత్వాన్ని సాకుగా చూపుతూ రాజకీయ విమర్శలకు తెరలేపింది. ఏ పార్టీ అధికారంలో ఉన్నా ఆయన ప్రస్తుతం మాత్రం వివాదాల్లో కేరాఫ్ గా నిలుస్తున్నాడు. ఇప్పుడు బొగ్గు స్కాం మొత్తం ఆయన కోసమే జరిగిందంటూ బీఆర్ఎస్ విమర్శలు చేస్తోంది. ఇంత జరుగుతున్నా ఆయన ఇప్పటి వరకూ రాజకీయంగా... వ్యాపారపరంగా ఎలాంటి రిప్లై రావడం లేదు.

**ఇటు కాంగ్రెస్ లోనూ విమర్శలు**

ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ విచారణ ఎదుర్కొంటున్న హరీష్‌రావు, ప్రజల దృష్టిని మళ్లించేందుకే సృజన్ రెడ్డిపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని తాజాగా ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి విమర్శించారు. సృజన్ రెడ్డి ముఖ్యమంత్రికి దూరపు బంధువైనప్పటికీ.. ఆయన బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డికి స్వయానా అల్లుడని గుర్తు చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనూ సృజన్ రెడ్డికి అనేక కాంట్రాక్టులు దక్కాయని.. అప్పుడు లేని అభ్యంతరం ఇప్పుడెందుకని ప్రశ్నించారు. సృజన్ రెడ్డికి సింగరేణి కాంట్రాక్టులు కట్టబెట్టారని బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని కిరణ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనూ సృజన్ రెడ్డితో పాటు ప్రతిమా శ్రీనివాస్, హర్ష వంటి వారికి కాంట్రాక్టులు దక్కాయని.. అప్పుడు లేని అభ్యంతరం ఇప్పుడెందుకని ప్రశ్నించారు. తన అల్లుడిని ఎందుకు బద్నాం చేస్తున్నారంటూ గతంలోనే కందాల ఉపేందర్ రెడ్డి స్వయంగా కేటీఆర్‌ను నిలదీశారని ఎంపీ కిరణ్ గుర్తు చేశారు.
ఇలా మొత్తంగా ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో సృజన్ రెడ్డి వివాదం నడుస్తోంది.

# గవర్నర్‌ను కలవనున్న కేటీఆర్ బృందం

మొదటిపేజీ తరువాయి



సమర్పించనున్నారు.
సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ టెండర్ల ప్రక్రియలో భారీ కుంభకోణం జరిగిందని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బంధువు సృజన్ రెడ్డికి లబ్ధి చేకూర్చేలా సింగరేణి టెండర్ల నిబంధనలను మార్చారని కేటీఆర్ ఆరోపిస్తున్నారు. సుమారు రూ.6 వేల కోట్ల విలువైన టెండర్లలో అవకతవకలు జరిగాయని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది.
గతంలో ఎన్నడూ లేని విధంగా సైట్ విజిట్ సర్టిఫికెట్ నిబంధనను తీసుకువచ్చి, తమకు కావలసిన సంస్థలకే టెండర్లు దక్కేలా చేశారని ఆరోపిస్తున్నారు. సింగరేణికి రావాల్సిన లాభాలను పక్కదారి పట్టించి, ఎన్నికల ఖర్చులు, వ్యక్తిగత ప్రయోజనాలకు ఉపయోగించుకుంటున్నారని గవర్నర్‌కు ఫిర్యాదు చేయనున్నారు. సింగరేణి టెండర్ల ప్రక్రియపై సిట్టింగ్ జడ్జితో లేదా హైకోర్టు న్యాయమూర్తితో లేదా సీబీఐతో పూర్తిస్థాయి విచారణ జరిపించాలని బీఆర్ఎస్ డిమాండ్ చేస్తోంది.

# సంతోష్ కుమార్‌కు నోటీసులు..
# రేవంత్ సర్కార్‌పై హరీశ్ రావు ఫైర్

- ఫోన్ ట్యాపింగ్ కేసులో సంతోష్ కుమార్ కు సిట్ నోటీసులు
- ఇవి రాజకీయ కక్ష సాధింపు చర్యలేనన్న హరీశ్ రావు
- గవర్నర్‌ను కలవనున్న నేపథ్యంలోనే నోటీసులు ఇచ్చారని ఆరోపణ
- ప్రజల దృష్టి మరల్చేందుకే కాంగ్రెస్ సర్కార్ కుట్ర చేస్తోందని విమర్శ



**హైదరాబాద్, (జనోదయ):**

ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ మాజీ ఎంపీ సంతోష్ కుమార్‌కు సిట్ నోటీసులు జారీ చేయడంపై ఆ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రంగా స్పందించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో సిట్ నోటీసులను రాజకీయ కక్ష సాధింపు కోసం ఒక ఆయుధంగా వాడుకోవడం పరిపాటిగా మారిందని ఆయన ఆరోపించారు.
కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతి, దోపిడీని ఆధారాలతో సహా బయటపెట్టేందుకు బీఆర్ఎస్ నేతల బృందం రేపు సాయంత్రం గవర్నర్‌ను కలవనున్న నేపథ్యంలో, ప్రజల దృష్టిని మరల్చేందుకే ఇవాళ మధ్యాహ్నం 3 గంటలకు హడావుడిగా సంతోష్ కుమార్‌కు నోటీసులు ఇచ్చారని హరీశ్ రావు విమర్శించారు.
గతంలో తాను బొగ్గు కుంభకోణం అంశాన్ని బయటపెట్టినప్పుడు తనకూ నోటీసులు ఇచ్చారని, అదే అంశాన్ని కేటీఆర్ ప్రస్తావించినప్పుడు ఆయనకూ సిట్ నోటీసులు పంపారని హరీశ్ రావు గుర్తుచేశారు. ఇది కేవలం ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారిపై కక్ష సాధించడమేనని అన్నారు. ప్రభుత్వం అనుసరిస్తున్న ఈ రాజకీయాలను ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని, బొగ్గు కుంభకోణం వెనుక ఉన్న నిజాలు బయటకు వస్తూనే ఉన్నాయని హరీశ్ రావు పేర్కొన్నారు.

# 57 బంతుల్లోనే 100 పరుగులు...

- డబ్ల్యూపీఎల్ చరిత్రలో తొలి సెంచరీ బాదిన నాట్ సివర్ బ్రంట్
- 57 బంతుల్లో 100 పరుగులతో అజేయంగా నిలిచిన సివర్
- హేలీ మాథ్యూస్‌తో కలిసి 131 పరుగుల భారీ భాగస్వామ్యం
- ఆర్సీబీకి 200 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించిన ముంబై



**హైదరాబాద్, (జనోదయ):**


ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ (WPL) చరిత్రలో కొత్త అధ్యాయం లిఖితమైంది. ముంబై ఇండియన్స్ స్టార్ ఆల్‌రౌండర్ నాట్ సివర్‌బ్రంట్ ఈ లీగ్‌లో తొలి సెంచరీ నమోదు చేసిన క్రీడాకారిణిగా రికార్డు సృష్టించింది. వడోదరా వేదికగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో జరిగిన మ్యాచ్‌లో ఆమె ఈ అద్భుత ఘనతను అందుకుంది.
ఈ మ్యాచ్‌లో ఆకాశమే హద్దుగా చెలరేగిన సివర్‌బ్రంట్ కేవలం 57 బంతుల్లోనే 16 ఫోర్లు, ఒక సిక్సర్‌తో అజేయంగా 100 పరుగులు చేసింది. ఓపెనర్ హేలీ మాథ్యూస్ (39 బంతుల్లో 56) కూడా రాణించడంతో వీరిద్దరూ కలిసి రెండో వికెట్‌కు 131 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఈ భాగస్వామ్యమే ముంబై భారీ స్కోరుకు పటిష్టమైన పునాది వేసింది.
టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ముంబై ఇండియన్స్‌కు ఆరంభంలోనే సజీవన్ సజన (7) వికెట్ రూపంలో షాక్ తగిలింది. అయితే సివర్, మాథ్యూస్ జోడీ ఆర్సీబీ బౌలర్లపై ఎదురుదాడికి దిగి స్కోరు బోర్డును పరుగులు పెట్టించింది. చివర్లో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (20) కూడా వేగంగా ఆడటంతో ముంబై నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 199 పరుగులు చేసింది.
ఆర్సీబీ బౌలర్లలో లారెన్ బెల్ 21 పరుగులిచ్చి 2 వికెట్లతో ఆకట్టుకుంది. ప్లేఆఫ్ రేసులో నిలవాలంటే తప్పక గెలవాల్సిన ఈ మ్యాచ్‌లో ముంబై, ప్రత్యర్థి ముందు 200 పరుగుల భారీ లక్ష్యాన్ని ఉంచింది.

# బీజేపీకి బిగ్ షాక్..
## పార్టీని వీడిన ఆరూరి రమేష్..

- బీజేపీని వీడిన మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్
- బీజేపీ సభ్యత్వానికి రాజీనామా చేస్తూ అధ్యక్షుడికి లేఖ రాసిన ఆరూరి రమేష్
- త్వరలో బీఆర్ఎస్‌లో చేరనున్న ఆరూరి రమేష్

**హైదరాబాద్, (జనోదయ):**

తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామం చోటు చేసుకుంది. వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ భారతీయ జనతా పార్టీకి (BJP) షాక్ ఇచ్చారు. గత కొంతకాలంగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్న ఆయన, తాజాగా బీజేపీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు తన రాజీనామా లేఖను పార్టీ రాష్ట్ర అధ్యక్షునికి పంపించారు. గత అసెంబ్లీ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ నుండి బీజేపీలో చేరిన ఆరూరి రమేష్, అక్కడ ఇమడలేకనే తిరిగి సొంత గూటికి వెళ్లాలని నిర్ణయించుకున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది.
ఆరూరి రమేష్ త్వరలోనే తిరిగి తన పాత పార్టీ అయిన బీఆర్ఎస్ (BRS) తీర్థం పుచ్చుకోనున్నట్లు సమాచారం. ఇప్పటికే గులాబీ పార్టీ అగ్రనేతలతో ఆయన చర్చలు జరిపినట్లు, ముహూర్తం కూడా ఖరారైనట్లు తెలుస్తోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో బలమైన నేతగా పేరున్న రమేష్ నిష్క్రమణ బీజేపీకి కొంత ప్రతికూల అంశమే అయినప్పటికీ, బీఆర్ఎస్ శ్రేణుల్లో మాత్రం కొత్త ఉత్సాహాన్ని నింపుతోంది. ఆయనతో పాటు జిల్లాకు చెందిన మరికొంత మంది కీలక నేతలు కూడా కారు ఎక్కే అవకాశం ఉన్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి.


Date:26-01-2026.

పత్రిక ప్రకటన

భారతీయ జనతా పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నాను. నాకు ఇన్ని రోజులు సహకరించిన బీజేపీ పెద్దలకు, నాయకులకు, కార్యకర్తలకు హృదయపూర్వక ధన్యవాదాలు.






## మున్సిపాలిటీ ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలి.. దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్

**దేవరకద్ర,జనవరి 26(జనోదయ):**

దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి జిఎంఆర్ మాట్లాడుతూ, మున్సిపాలిటీ ఎన్నికల కోసం ముఖ్య నాయకులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని పార్టీలో టికెట్ ఎవరికి వచ్చిన అందరు కలిసికట్టుగా పనిచేయాలని,మున్సిపాలిటీలో 12 వార్డులలో అన్నింటిలో మున్సిపల్ చైర్మన్ పదవిని కైవసం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకులకు యువకులకు కార్యకర్తలను ఆయన తెలియజేశారు.
ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు యువకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు




## మాజీ ఎంపీ సంతోష్ రావుకు
# సిట్ నోటీసులు..!

మొదటిపేజీ తరువాయి

పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో, విచారణ నిమిత్తం జనవరి 27వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు జుబ్లీహిల్స్ ఏసీపీ కార్యాలయంలో స్వయంగా హాజరు కావాలని జుబ్లీహిల్స్ విభాగం అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ పి. వెంకటగిరి ఆదేశించారు.
ఇప్పటికే ఈ ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ అధికారులు మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్‌రావులను విచారించిన సంగతి తెలిసిందే. ఐటీ చట్టం (I.T. Act) , ప్రభుత్వ ఆస్తుల నష్టం నిరోధక చట్టం (PDPP Act)వంటి కఠిన సెక్షన్ల కింద కొనసాగుతున్న ఈ విచారణలో సంతోష్‌రావుకు నోటీసులు అందడం రాజకీయ వర్గాల్లో పెను కలకలం రేపుతోంది. రేపు మధ్యాహ్నం జరగబోయే ఈ విచారణలో సిట్ అధికారులు సంతోష్‌రావు నుండి ఎటువంటి సమాచారాన్ని రాబడతారనే అంశంపై ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది.




Office of the Asst. Commissioner of Police, Jubilee Hills Division, Hyderabad
Dated: 26-01-2026

NOTICE U/S. 160 Cr.P.C

Sub:- For appearance before the undersigned for examination in connection with further investigation - Reg.

Ref:- Cr.No 243/2024 U/Sec. 166, 409, 427, 201, 120 (B) r/w. 34 IPC Sec 3 of PDPP Act. Sec 65, 66, 66 (F)(1)(B)(2) 70 of I.T. Act 2000 of P.S. Panjagutta, Hyderabad

# హార్వర్డ్ యూనివర్సిటీలో శిక్షణ తరగతులకు సీఎం రేవంత్



- హార్వర్డ్ యూనివర్సిటీలో విద్యార్థిగా మారనున్న సీఎం రేవంత్ రెడ్డి
- 'లీడర్‌షిప్ ఇన్ 21వ శతాబ్దం' కోర్సులో చేరిక
- భారీ హిమపాతం, ప్రతికూల వాతావరణంలోనే తరగతులకు హాజరు
- సీఎం అమెరికా పర్యటనపై ప్రతిపక్ష బీజేపీ విమర్శలు
- ప్రజా బాధ్యతల కంటే వ్యక్తిగత ఆకాంక్షలకే ప్రాధాన్యతా? అని ప్రశ్న

**హైదరాబాద్, (జనోదయ):**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికాలోని ప్రఖ్యాత హార్వర్డ్ యూనివర్సిటీలో తన ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ కార్యక్రమాన్ని మొదలుపెట్టారు. మసాచుసెట్స్‌లోని కేంబ్రిడ్జ్‌లో ఉన్న కెన్నడీ స్కూల్‌లో 'లీడర్‌షిప్ ఇన్ ది 21వ సెంచరీ: కేయాస్, కాన్‌ఫ్లిక్ట్, అండ్ కరేజ్' అనే కోర్సులో ఆయన చేరారు. ఆదివారం స్థానిక కాలమానం ప్రకారం ప్రోగ్రామ్ ఓరియంటేషన్, సహ విద్యార్థుల పరిచయంతో తరగతులు మొదలయ్యాయని ముఖ్యమంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

సోమవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు తరగతులు జరుగుతున్నాయి. ఈ సమయంలో సీఎం రేవంత్ రెడ్డి వివిధ తరగతులు, కేస్ స్టడీ అనాలిసిస్, కన్సల్టేటివ్ గ్రూప్ వర్క్‌లో పాల్గొంటున్నారు. ఈ కోర్సులో భాగంగా ఆయన ఇతర విద్యార్థులతో కలిసి అసైన్‌మెంట్లు, హోంవర్క్, గ్రూప్ ప్రాజెక్టులు పూర్తి చేయాల్సి ఉంటుంది. జనవరి 30 వరకు ఈ తరగతులు కొనసాగుతాయి. కోర్సు పూర్తయ్యాక రేవంత్ రెడ్డి హార్వర్డ్ నుంచి సర్టిఫికెట్ అందుకుంటారు. స్వతంత్ర భారత చరిత్రలో ఒక ముఖ్యమంత్రి పదవిలో ఉండగా ఐవీ లీగ్ యూనివర్సిటీలో ఇలాంటి కోర్సులో చేరడం ఇదే తొలిసారని సీఎంవో పేర్కొంది. ఐదు ఖండాలకు చెందిన 20కి పైగా దేశాల నుంచి వచ్చిన వారు ఈ తరగతులకు హాజరవుతున్నారు.

మరోవైపు, బోస్టన్ ప్రాంతంలో 'ఫెర్న్' అనే మంచు తుపాను కారణంగా అత్యవసర పరిస్థితి నెలకొంది. రెండు అడుగుల మేర హిమపాతం, మైనస్ 20 డిగ్రీల కంటే తక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇంతటి ప్రతికూల వాతావరణంలోనూ రేవంత్ రెడ్డి తరగతులకు హాజరవుతున్నారు. గత వారం స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ సదస్సులో పాల్గొన్న అనంతరం ఆయన నేరుగా అమెరికా వెళ్లారు.

అయితే, సీఎం రేవంత్ రెడ్డి హార్వర్డ్‌లో కోర్సులో చేరడంపై ప్రతిపక్ష బీజేపీ విమర్శలు గుప్పించింది. నాయకత్వం అనేది స్వల్పకాలిక కోర్సుల ద్వారా కాకుండా, పాలన, జవాబుదారీతనం, క్షేత్రస్థాయిలో ఫలితాల ద్వారా నిరూపించుకోవాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన అధికార ప్రతినిధి ఎన్.వి. సుభాష్ వ్యాఖ్యానించారు. "ఇలాంటి అకడమిక్ కోర్సులను జీవితంలో ముందే పూర్తి చేయాల్సింది కదా?" అని ఆయన ప్రశ్నించారు. ముఖ్యమంత్రికి అసలైన తరగతి గది ఆయన పాలిస్తున్న రాష్ట్రమే కానీ, విదేశీ క్యాంపస్ కాదని ఎద్దేవా చేశారు. ఈ పర్యటన ప్రజా బాధ్యతల కంటే వ్యక్తిగత ఆకాంక్షలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లుగా ఉందని, దీనికి అవుతున్న ఖర్చుపైనా ఆయన సందేహాలు వ్యక్తం చేశారు.



# లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత

**కౌకుంట్ల,జనవరి 26 (జనోదయ):**

కౌకుంట్ల మండల కేంద్రానికి చెందిన ఎద్దుల సుమిత్ర సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి 60,000 చెక్కును కౌకుంట్ల గ్రామ సర్పంచ్ ఉల్లి నరేష్ కుమార్ గారు జిల్లా ప్రధాన కార్యదర్శి కిషన్ రావ్ లబ్ధిదారులకు అందజేయడం జరిగింది, ఈ కార్యక్రమంలో ఓబీసీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, కౌకుంట్ల టౌన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బెందుల ప్రభు, ఉప సర్పంచ్ లక్ష్మీకాంత్ రావ్, వార్డ్ మెంబర్ శాంతం రవీందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పెద్దలు తుమ్మల నర్సింహారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి,బడుగుల విష్ణు, తదితరులు పాల్గొన్నారు

# దేశ ప్రతిష్ఠకు శక్తిమంతమైన ప్రతీక

మొదటిపేజీ తరువాయి

ఏకతాటిపై నిలిపే ఐక్యత ప్రదర్శితమయ్యాయని ఆయన పేర్కొన్నారు.

దేశం 77వ గణతంత్ర దినోత్సవాన్ని ఎంతో ఉత్సాహంతో, గర్వంతో జరుపుకుందని ప్రధాని తెలిపారు. "గణతంత్ర దినోత్సవ పరేడ్, భారత దేశ అద్భుతమైన భద్రతా వ్యవస్థను ప్రదర్శించింది. ఇది మన దేశ సంసిద్ధత, సాంకేతిక సామర్థ్యం, పౌరులను రక్షించడంలో మనకున్న అచంచలమైన నిబద్ధతను ప్రతిబింబిస్తుంది" అని మోదీ మరో పోస్ట్‌లో వివరించారు. మన భద్రతా దళాలు నిజంగా దేశానికి గర్వకారణమని ఆయన కొనియాడారు.

పరేడ్ ప్రారంభానికి ముందు, ప్రధాని మోదీ జాతీయ యుద్ధ స్మారకాన్ని సందర్శించి, దేశ రక్షణ కోసం ప్రాణాలర్పించిన అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జాతీయ పతాకాన్ని ఆవిష్కరించడంతో గణతంత్ర వేడుకలు అధికారికంగా ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది యూరోపియన్ కౌన్సిల్ ప్రెసిడెంట్ ఆంటోనియో కోస్టా, యూరోపియన్ కమిషన్ ప్రెసిడెంట్ ఉర్సులా వాన్ డెర్ లేయన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

ఈ పరేడ్‌లో భారత సైన్యం తొలిసారిగా 'బ్యాటిల్ అర్రే' ఫార్మాట్‌లో తమ యుద్ధ నైపుణ్యాలను ప్రదర్శించింది. స్వదేశీ ఆయుధాలు, క్షిపణి వ్యవస్థలతో పాటు, వివిధ రాష్ట్రాలు, మంత్రిత్వ శాఖలకు చెందిన శకటాలు, సాంస్కృతిక ప్రదర్శనలు కర్తవ్యపథ్‌లో కనువిందు చేశాయి.

ప్రతి ఏటా మాదిరిగానే ఈసారి కూడా ప్రధాని మోదీ పరేడ్ ముగిశాక ప్రోటోకాల్‌ను పక్కనపెట్టి కర్తవ్యపథ్‌లో నడిచారు. ఆయన చాలా దూరం నడుస్తూ, ఇరువైపులా ఉన్న ప్రేక్షకులకు అభివాదం చేశారు. ప్రధానిని చూసిన ప్రజలు 'భారత్ మాతా కీ జై', 'మోదీ మోదీ' నినాదాలతో హోరెత్తించారు. చేతిలో త్రివర్ణ పతాకాలు పట్టుకుని, ఉత్సాహంగా ఆయనకు స్వాగతం పలికారు. చిన్నారులు కుర్చీలపైకి ఎక్కి మరీ ప్రధానిని చూసేందుకు ఆసక్తి చూపారు.



కొంత దూరం నడిచిన తర్వాత, ప్రధాని తన వాహనంలోకి ఎక్కి ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. రాజస్థానీ సంప్రదాయ తలపాగా, నెమలి ఈకల అలంకరణతో మోదీ తన ప్రత్యేకమైన వస్త్రధారణతో మరోసారి ఆకట్టుకున్నారు.

# గద్వాల్ కాంగ్రెస్ లో టికెట్ల కోసం పోటాపోటీ..

మొదటిపేజీ తరువాయి

అంటున్న రెండు వర్గాలు ఏం చేయబోతున్నాయి? ఎక్కడ జరుగుతోందా పోట్ల గిత్తల పోరు? ఆ విషయంలో కాంగ్రెస్ అధిష్టానం ఏం చేయాలనుకుంటోంది? మున్సిపల్ ఎన్నికల వేళ గద్వాల్ నియోజకవర్గ రాజకీయం రసత్తరంగా మారుతోంది. కాంగ్రెస్ పార్టీ టికెట్ల కేటాయింపు అంశం వివాదాస్పదం అవుతోంది. ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్చార్జ్ సరితా తిరుపతయ్య మధ్య అగ్గి మరింత రాజుకుంటున్నట్టు తెలుస్తోంది. మొత్తం టికెట్లు నా వర్గానికే కావాలని ఎమ్మెల్యే... సగానికి పైగా మాకేనంటూ మరో వర్గం పార్టీ పెద్దల ముందు ప్రతిపాదనలు పెట్టడం ఉత్కంఠ రేపుతోంది. దీనికి తోడు గద్వాల మున్సిపల్ చైర్మన్ పీఠంపై తమ వారినే కూర్చోపెట్టాలంటూ ఇద్దరు నాయకులు పట్టుదలగా ఉన్నారట. దీంతో...

ఈ మొత్తం వ్యవహారం హస్తం పార్టీ అధిష్ఠానానికి తలనొప్పిగా మారింది. గద్వాల్ కాంగ్రెస్ వర్గ పోరు ఒడవని ముచ్చటగా మారిపోయింది. బీఆర్ఎస్ తరపున గెలిచిన ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి ఆ పార్టీకి దూరమైనప్పటి నుంచి వర్గ పోరు మొదలైంది. తాజాగా మున్సిపల్ ఎన్నికల వేళ మరోమారు తన వర్గీయులకు టికెట్లు ఇప్పించుకొని పై చేయి సాధించేలా ఎత్తుగడలు వేస్తున్నారట ఎమ్మెల్యే. 37 వార్డులు ఉన్న గద్వాల్ మున్సిపాలిటీలో తమ వర్గం వాటా తేల్చాలని పట్టుబడుతున్నారు ఇన్చార్జ్ సరిత. ఇప్పటికే సర్పంచ్ ఎన్నికల్లో ఆశించిన స్థాయిలో తన వర్గీయులను గెలిపించుకున్న సరిత... మున్సిపాలిటీలోనూ పట్టు తగ్గకుండా సగానికి పైగా వార్డులు తమకు కేటాయించాలని పట్టుబడుతున్నారు.

ఇదే డిమాండ్‌ను జిల్లా ఇంచార్జి మంత్రితో పాటు ఎంపీ మల్లు రవి, ఇతర పార్టీ పెద్దల ముందు పెట్టినట్టు సమాచారం. ఇదే సమయంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ఫిరాయింపు అంశాన్ని తెరమీదకు తెస్తూ అసలు ఆయన మనుషులకు టిక్కెట్లు ఎలా ఇస్తారని ప్రశ్నిస్తున్నారట. తాను పార్టీ మారలేదని, బీఆర్ఎస్‌లోనే ఉన్నానని చెబుతున్నారు బండ్ల. అలాంటి నాయకుడి వర్గానికి కాంగ్రెస్ టిక్కెట్స్ ఎలా ఇస్తారన్నది సరిత ప్రశ్న. అదే సమయంలో ఎమ్మెల్యే కూడా.... మొత్తం 37 వార్డులను తన వర్గీయులకే ఇవ్వాలని, ఒక్కటి కూడా అటు ఇటు కాకుండా 100శాతం గెలిపిస్తానని చెబుతున్నారట. ఒకవేళ పూర్తి స్థాయిలో తన వర్గీయులకు ఇవ్వకుంటే రెబెల్స్‌ని నిలబెట్టే యోచనలో ఉన్నట్టు సమాచారం. సర్పంచ్ ఎన్నికల్లో తన అనుయాయులను నిలబెట్టి గెలిపించుకున్న అంశాన్ని ఉదాహరిస్తున్నారాయన. మున్సిపల్ ఎన్నికలను కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా భావించి ముందుకెళ్తున్న టైంలో గద్వాల ఎపిసోడ్ తలనొప్పిగా మారింది. దీంతో పార్టీ పెద్దలు ఈ అంశంపై ఇప్పటికే ఫోకస్ పెట్టినట్లు తెలుస్తోంది. ఇద్దరితో మీటింగ్ పెట్టి వార్డుల వాటా తేల్చేందుకు సిద్ధమైనట్లు సమాచారం. ఒకవేళ ఈ పంచాయతీకి ఫుల్ స్టాప్ పడకపోతే బీజేపీ, BRSలు వ్యూహాత్మకంగా అడుగులు వేసి పరిస్థితిని అనుకూలంగా మలుచుకోవాలనుకుంటున్నట్టు తెలుస్తోంది. పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్న కాంగ్రెస్ పెద్దలు మున్సిపల్ నగరా మోగే నాటికి ఇష్యూ క్లోజ్ చేయాలనుకుంటున్నట్టు తెలుస్తోంది. దీంతో గద్వాల కాంగ్రెస్ యుద్ధంలో ఎవరికి పైచేయి అవుతుందన్నది ఆసక్తికరంగా మారింది.




# మెదక్ జిల్లాలో బీజేపీకి అభ్యర్థుల కరువు

మొదటిపేజీ తరువాయి

ఉమ్మడి మెదక్ జిల్లాలో బీజేపీకి ఒక ఎంపీ, ఎమ్మెల్సీ ఉన్నారు. గత లోక్ సభ ఎన్నికల్లో మెదక్ ఎంపీగా గెలిచారు రఘునందన్ రావు. ఇక గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అంజిరెడ్డి పార్టీ తరపున విజయం సాధించారు. దీంతో ఉమ్మడి జిల్లా మొత్తంలో పార్టీ బలపడుతుందని అంతా అనుకున్నారు. కానీ.... ఇప్పుడు బలం సంగతి తర్వాత...అసలు ఉనికి ఉందా అన్న అనుమానాలు పెరుగుతున్నాయట చాలా మందికి. ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో ఆ పార్టీకి వచ్చింది నామమాత్రపు ఫలితాలే. ఆ సమయంలో నాయకత్వ తీరుపై కేడర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్టు సమాచారం. తమను ఎవరూ పట్టించుకోలేదని, ఎలాంటి సహకారం అందించలేదనేది కోపంగా ఉన్నట్టు సమాచారం. ఇక ఇప్పుడు మున్సిపల్ ఎన్నికల టైంలో మరోసారి నాయకత్వ తీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయట. సంగారెడ్డి జిల్లాలో 11, మెదక్ జిల్లాలో 4, సిద్దిపేట జిల్లాలో 5 మున్సిపాలిటీలు ఉండగా...ఇందులో మెజార్టీ మున్సిపాలిటీల్లో కమలం పార్టీకి అభ్యర్థులు కరవైనట్టు చెప్పుకుంటున్నారు.

ఆయా టౌన్స్‌లో పార్టీని పట్టించుకునే లీడర్స్ ఎవరూ లేకపోవడమే అందుకు ప్రధాన కారణం అంటున్నారు. ఇప్పటికే అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష BRS కొన్ని చోట్ల అభ్యర్థులను ప్రకటించి వార్డుల్లో ప్రచారం చేస్తుంటే... బీజేపీ మాత్రం అభ్యర్థులుగా ఎవరు దొరుకుతారా అన్న వెదుక్కోవాల్సి రావడమే అసలు విషాదం అన్న మాటలు వినిపిస్తున్నాయి ఉమ్మడి జిల్లాలో. అయితే ఈ అభ్యర్థుల వేట వెనుక ఓ వెరైటీ స్ట్రాటజీ ఉందని అంటున్నారు బీజేపీ లీడర్స్. కాంగ్రెస్, BRS టికెట్స్ ఆశించి భంగపడ్డ వారిని కాషాయ పార్టీ... రా.... రమ్మని పిలిచి రెడ్ కార్పెట్ వేయాలనుకుంటున్నట్టు సమాచారం. ఆర్థికంగా బలంగా ఉండి టికెట్ రాని వారు మా పార్టీలో చేరండి. మీ వార్డుల నుంచి పోటీ చేయండి. గెలవండి అంటూ బంపరాఫర్స్ ఇస్తున్నట్టు తెలిసింది. ఈ నిర్ణయంపై పార్టీలో జోరుగా చర్చ జరుగుతోందట. సిట్టింగ్ ఎంపీ ఉన్న చోట ఇలాంటి పరిస్థితి రావడం ఏంటన్నది కార్యకర్తల క్వశ్చన్. అటు ఎంపీ రఘునందన్ రావు తన పరిధిలోని మున్సిపాలిటీల్లో తిరుగుతూ నాయకులకు దిశా నిర్దేశం చేస్తున్నా... ద్వితీయ శ్రేణి నాయకత్వ లోపం కారణంగా...కేడర్‌లో నమ్మకం పెరగడం లేదంటున్నారు. సంగారెడ్డి నియోజకవర్గం నుంచి రాజేశ్వర్ దేశ్ పాండే ఉండగా ఆయనకి అసెంబ్లీ ఎన్నికల సమయంలో టికెట్ ఇవ్వలేదు.

దీంతో ఆయన BRSలో చేరి తిరిగి లోక్ సభ ఎన్నికల సమయంలో బీజేపీ కండువా కప్పుకున్నారు. ప్రస్తుతం దేశ్‌పాండేకు ఫ్రీ హ్యాండ్ ఇవ్వట్లేదని తెలుస్తోంది. అందుకే ఆయన కూడా ఆచి తూచి అడుగులేస్తున్నట్టు సమాచారం. ఇక జహీరాబాద్, ఆందోల్, పటాన్ చెరులో పార్టీని పట్టించుకునే వారు లేరు. మెదక్, నర్సాపూర్‌లోనూ సేమ్ సీన్. సిద్దిపేట జిల్లాలోని దుబ్బాక తన సొంత నియోజకవర్గం కావడంతో ఇంట గెలిచి రచ్చ గెలవాలన్నట్టు అక్కడే స్పెషల్ ఫోకస్ పెట్టారట ఎంపీ రఘునందన్‌రావు. ఇప్పటికైనా పార్టీ పెద్దలు పట్టించుకుని మున్సిపల్ ఎన్నికలపై ఫోకస్ పెట్టి పని చేస్తేనే కాస్తో కూస్తో ఉనికి చాటుకోగలమని, లేదంటే తీవ్ర ఇబ్బందులు తప్పవన్నది కేడర్ వాయిస్. ఏవో కొన్ని కౌన్సిలర్ స్థానాలు గెలిచి.... అదే పదివేలని సర్దుకుంటారా..? లేక ఉమ్మడి జిల్లా మీద పట్టు బిగిస్తారా అన్నది చూడాలంటున్నారు రాజకీయ పరిశీలకులు.




# గణతంత్ర దినోత్సవ వేడుకలలో పాల్గొన్న దేవరకద్ర ఎమ్మెల్యే, జిఎంఆర్

**భూత్పూర్,జనవరి 26 (జనోదయ):**

భూత్పూర్ మండలం కొత్త మొల్గర గ్రామంలో 77 వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద మరియు ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొని గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసిన దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూధన్ రెడ్డి జిఎంఆర్ ఈ సందర్భంగా ఎమ్మెల్యే జియంఆర్ మాట్లాడుతూ , భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి నేటితో 77 ఏళ్లు అవుతున్న సందర్భంగా దేశ ప్రజలకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. రాజ్యాంగం ద్వారా సంపూర్ణ స్వేచ్ఛ, సమానత్వం, లౌకికతత్వం, న్యాయాన్ని పూర్తి స్థాయిలో ఒక హక్కుగా పొందడం జరిగిందని పేర్కొన్నారు, జాతీయోద్యమ నాయకులు, రాజ్యాంగ నిర్మాతల ఆకాంక్షలకు అనుగుణంగా అనేక అభివృద్ధి, సంక్షేమ, ప్రజాహిత కార్యక్రమాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అమలు చేస్తోందని అన్నారు.గత ప్రభుత్వం విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించిందని, కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా వ్యవస్థను ప్రక్షాళించి, టీచర్ల పోస్టులు భర్తీ చేయడంతో పాటు గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయిలో విద్యను అందించాలని లక్ష్యంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలకు శ్రీకారం చుట్టిందని, ఐటిఐ లను ఏటీసీలుగా పునరుద్ధరించిందని, ప్రాథమిక విద్య నుంచే విద్యార్థులకు ఏఐ పై అవగాహన కల్పించాలన్న లక్ష్యంతో పనిచేస్తూ ప్రణాళికలు సిద్ధం చేసి ముందుకు సాగుతున్నామని తెలిపారు. గత పదేళ్ల పాలనలో టీచర్ల నియామకాలను చేపట్టలేదని, విద్యాశాఖకు నిధులు కేటాయించలేదని బిఆర్ఎస్ ప్రభుత్వ తీరును ఎండగట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తూ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా విద్యాశాఖకు అధిక నిధులు కేటాయించడంతో పాటు 11,062 టీచర్ పోస్టులు భర్తీ చేశామని, 15 ఏళ్ల తర్వాత సుమారు 19,000 మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించామని, అమ్మ ఆదర్శ పాఠశాల పేరుతో పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించామని, స్కూలు ప్రారంభమైన మొదటి వారంలోనే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం లు పంపిణీ చేశామని, పదేళ్లలో ఎన్నడు లేని విధంగా విద్యార్థులకు డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచామని గుర్తు చేశారు. దేవరకద్ర నియోజకవర్గం లో బిఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లు అధికారంలో ఉండి, కనీసం డిగ్రీ కాలేజ్ ను ఏర్పాటు చేయలేకపోయారని, కానీ తాము అధికారంలోకి వచ్చిన పది నెలల్లోనే నియోజకవర్గ కేంద్రంలో డిగ్రీ కాలేజ్ మంజూరు ఏర్పాటు చేశామని, చిన్న చింతకుంట మండల కేంద్రంలో జూనియర్ కాలేజ్ ఏర్పాటు చేశామని తెలియజేశారు.విద్యార్థులు ఎలాంటి ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా ఏకాగ్రతతో చదువుకోవాలని, పదవతరగతి లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని కోరారు, ప్రభుత్వ పాఠశాలల్లోనే క్వాలిఫైడ్ టీచర్స్ ఉంటారని, విద్యార్థులకు మంచి విద్యాబోధన అందుతుందని తెలిపారు, చదువుకుంటే ప్రపంచాన్ని చేయించవచ్చని అన్నారు.తాను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అందరం ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుకోనీ ఈ స్థాయికి వచ్చామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి గ్రామ సర్పంచ్ వెంకటేష్ మరియు ఉపసర్పంచ్ వార్డ్ మెంబర్ దాసరి సాయికుమార్ మరియు వివిధ గ్రామాల సర్పంచులు కాంగ్రెస్ పార్టీ నాయకులు యువకులు తదితరులు పాల్గొన్నారు.





# బుగ్గ దేవస్థానం నూతన పాలక-వర్గం ఖరారు

**జనోదయ, బెల్లంపల్లి, జనవరి 26:**



బెల్లంపల్లి మండలంలోని కన్నాల గ్రామపంచాయతీ పరిధిలోగల శ్రీ బుగ్గ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం నూతన పాలకవర్గాన్ని ఆదివారం క్యాంపు కార్యాలయం లో ఎమ్మెల్యే గడ్డం వినోద్ సమక్షంలో ఖరారు చేశారు. నూతన పాలకవర్గంలో దేవస్థాన చైర్మన్ గా దూరం మహేష్ (సోమ గూడెం ,భరత్ కాలనీ), డైరెక్టర్లుగా కోరాళ్ల పుష్ప (ఎస్సీ కాలనీ, తాండూర్), మంద ఉదయ్ వికాస్ (కన్నాల, బెల్లంపల్లి), పెద్ది రాజేందర్ (బెల్లంపల్లి), చిలువేరు అరవిందు (అంకుశం, బెల్లంపల్లి), మీస రమేష్ (ఇందిరానగర్, చిన్న బూద), సుంకరి రాజేష్ ( రామకృష్ణాపూర్, మందమర్రి) లు ఖరారయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గడ్డం వినోద్ సహకారంతో బుగ్గ దేవస్థానం అభివృద్ధికి కృషి చేస్తామని, శివరాత్రి జాతరలో భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడతామని నూతన పాలకవర్గ కమిటీ సభ్యులు తెలిపారు.

# జిల్లాలో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు

- **జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**జనవరి 26, 2026:జానోదయ మంచి-ర్యాల:**

77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను జిల్లాలో ఘనంగా నిర్వహించడం జరిగిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో ఏర్పాటు చేసిన వేడుకలలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య, డి.సి.పి. ఎ.భాస్కర్, జిల్లా అటవీ అధికారి శివ్ ఆశిష్ సింగ్, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ లతో కలిసి హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ శాఖల పరిధిలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల ప్రగతిని వివరించారు. అనంతరం ప్రభుత్వ శాఖలలో పనిచేస్తూ ఉత్తమ సేవలు అందించిన అధికారులు, ఉద్యోగులకు ప్రశంస పత్రాలు అందజేశారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలపై ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జిల్లా అధికారి చాతరాజుల దుర్గాప్రసాద్ తో కలిసి కులాంతర వివాహ పథకం కింద ఒక్కొక్క జంటకు 2 లక్షల 50 వేల రూపాయల చొప్పున 3 సంవత్సరాల పాటు ఫిక్స్డ్ డిపాజిట్ చేసిన బాండ్లను 5 జంటలకు అందజేశారు. వ్యవసాయ పరికరాల పంపిణీ కార్యక్రమంలో భాగంగా 9 మంది అర్హులైన రైతులకు రాయితీపై పవర్ క్నాప్సాక్ స్ప్రేయర్లు, రోటవేటర్లు, పవర్ టిల్లర్లు అందజేశారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు, యువత, విద్యార్థినీ, విద్యార్థులు, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.



# ఉత్తమ అధికారిగా అవార్డ్ అందుకున్న రాథోడ్ గణపతి

**జనోదయ, మందమర్రి జనవరి 26::**

మండల తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ ఇన్స్ పెక్టర్ (ఎంఆర్ఐ)గా విదులు నిర్వహిస్తున్న రాథోడ్ గణపతి జిల్లా స్థాయి ఉత్తమ అధికారి గా ఎంపికయ్యారు. ఈ మేరకు జిల్లా కేంద్రం లోని కలెక్టరేట్ లో నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా జిల్లా ఉన్నతాధికారుల చేతుల మీదుగా అవార్డ్ అందుకున్నారు. విది నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు గాను ఉత్తమ అధికారిగా ఎంపిక చేసి అవార్డ్, ప్రశంసా పత్రం అందించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అవార్డ్ గ్రహీత గణపతి మాట్లాడుతూ అవార్డ్ రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ అవార్డ్ తో తనపై బాధ్యత మరింత పెరిగిందని మరింత సమర్థవంతంగా విధులు నిర్వహించి ప్రజలకు మెరుగైన సేవలందిస్తానని తెలిపారు. కాగా అవార్డ్ అందుకున్న ఎంఆర్ఐ ని మండల తహసీల్దార్ సతీష్ కుమార్ శర్మ కార్యాలయం అధికారులు అభినందించారు.



# అడవిని వీడిన తుపాకీ.! భర్త మరణంతో కుంగుబాటు





బాలక్క అలియాస్ జాడి పుష్ప

- **.. బీజాపూర్ పోలీసుల ఎదుట బాలక్క అలియాస్ పుష్ప లొంగుబాటు**
- **25 ఏళ్ల మావోయిస్టు ఉద్యమ ప్రస్థానానికి ఇక తెర**

**జనోదయ, బెల్లంపల్లి, జనవరి 26:** దండకారణ్యంలో సాయుధ పోరును నడిపిన తుపాకీ అడవిని వీడింది. బుల్లెట్ తోనే రాజ్యాధికారం సాధ్యమని నమ్మిన సిద్ధాంతం వెనకడుగేసింది .మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలం చంద్రవెల్లి గ్రామానికి చెందిన ఆవుల బాలక్క అలియాస్ జాడి పుష్ప తన 25 ఏళ్ల అజ్ఞాత దండకారణ్య జీవితం వీడి శనివారం చత్తీస్ ఘడ్ రాష్ట్రం బీజాపూర్(దంతారి) పోలీసుల ఎదుట ఆయుధంతో లొంగిపోయి జనజీవనం బాట పట్టింది. తాజాగా లొంగిపోయిన మావోయిస్టు జాడి పుష్ప దండకారణ్యంలో టెక్నికల్ టీం సభ్యురాలు పనిచేస్తోంది. లొంగిపోయిన జాడి పుష్ప భర్త జాడి పోషం గత ఏడాది సెప్టెంబర్ 12న చత్తీస్ ఘడ్ రాష్ట్రంలోని గరియా బంద్ జిల్లా అడవుల్లో భద్రతా దళాలతో జరిగిన ఎదురుకాల్పుల్లో హతమయ్యాడు. ఆపరేషన్ కగార్ నేపథ్యంలో పెద్ద సంఖ్యలో మావోయిస్టు పార్టీఅగ్ర నేతలు, వివిధ హోదాల్లో పనిచేస్తున్న దళ సభ్యులు లొంగుబాటు నిర్ణయం తీసుకుంటున్నారు. చంద్రవెల్లి గ్రామానికి చెందిన ఆవుల బాలక్క1986 లో అదే గ్రామానికి చెందిన జాడి వెంకటిని ప్రేమ వివాహం చేసుకుంది. 1994 వరకు బెల్లంపల్లి తహసీల్ కార్యాలయంలో సుంకరిగా పనిచేసిన జాడి వెంకట్ కి అప్పటి పీపుల్స్ వార్ అనుబంధ సంఘమైన సికాస (సింగరేణి కార్మిక సమాఖ్య) తో పరిచయాలు ఏర్పడ్డాయి. ఒక వైపు బెల్లంపల్లి తహసీల్ కార్యాలయంలో సుంకరిగా పనిచేస్తూనే జాడి వెంకటి సికాస నక్సలైట్లకు కొరియర్ గా పనిచేశారు. ఈ క్రమంలో పోలీసుల నుండి తీవ్రమైన వేధింపులు ఎదుర్కొని నాలుగేళ్లు జైల్లో గడిపారు. 1999 లో విడుదలై రహస్యంగా భార్య బాలక్క తో సహా అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. అప్పటినుండి భర్త జాడి పోషంతో కలిసి బాలక్క అలియాస్ జాడి పుష్ప దండకారణ్యంలో 25 ఏళ్ళు గా విప్లవోద్యమ బాటలో కొనసాగారు. విప్లవోద్యమంలో కలసి పనిచేసిన భర్త జాడి పోశం మరణంతో కృంగిపోయిన బాలక్క (పుష్ప) ఎట్టకేలకు దళంలోని సహచరులతో కలసి ఆయుధాన్ని బీజాపూర్ (దంతారి) పోలీసులకు అప్పజెప్పి లొంగిపోయింది.25 ఏళ్ల మావోయిస్టు ఉద్యమ ప్రస్థానాన్ని వీడి మళ్లీ జనం బాట పట్టింది. జాడి పుష్ప లొంగుబాటుతో విప్లవోద్యమానికి ఊపిరి ఊదిన బెల్లంపల్లి మావోయిస్టు ఉద్యమంలో ఇక చరిత్ర లాగే మిగిలిపోనుంది.

# ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు



**జనోదయ, మందమర్రి జనవరి 26:**

77 వ భారత గణతంత్ర దినోత్సవ వేడుకలు పట్టణంలో మండలం లోని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఘనంగా నిర్వహించారు. రిపబ్లిక్ డే ఉత్సవాలు భాగంగా సోమవారం పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు ,రాజకీయ పార్టీల కార్యాలయాలు, పాఠశాలలు, పట్టణ ముఖ్య కూడళ్లలో, గ్రామాల్లోని గ్రామపంచాయతీ కార్యాలయాల్లో జాతీయ జెండాను ఆవిష్కరించి గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ తుంగ పిండి రాయలింగు, ప్రభుత్వ ప్రాథమిక ఆసుపత్రిలో డాక్టర్ రమేష్, పోలీస్ స్టేషన్లో సీఐ పర్స రమేష్, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రాజేశ్వర్, తహసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ సతీష్ కుమార్ శర్మ, మండల విద్యాధికారి కార్యాలయంలో ఎంఈఓ రాథోడ్ రమేష్, వ్యవసాయాధికారి కార్యాలయంలో ఏఓ కిరణ్మయి, పశు వైద్య శాలలో వైద్యాధికారి తిరుపతి, కస్తూర్బా పాఠశాలలో ఎస్ఓ సునీత,మోడల్ స్కూల్ లో ప్రిన్సిపాల్ సారా తస్నీమ్, మార్కెట్ సంజయ్ గాంధీ విగ్రహం వద్ద పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు నోముల ఉపేందర్ గౌడ్ , బిఆర్ఎస్ కార్యాలయం లో బిఆర్ఎస్ నాయకులు జే రవీందర్, పాత బస్టాండ్ ప్రాంతంలో బీజేపీ సీనియర్ నాయకులు రామటెంకి దుర్గరాజ్, బిఎస్పీ కార్యాలయంలో బిఎస్పీ జిల్లా అధ్యక్షులు రాజేంద్ర ప్రసాద్, టీడీపీ కార్యాలయం లో టిడిపి పెద్దపల్లి పార్లమెంట్ ఇంచార్జీ బి సంజయ్ కుమార్ లు జాతీయ జెండాలు ఆవిష్కరించారు. అందువల పేట గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ ముత్యం రమ, పులిమడుగు గ్రామపంచాయతీలో సర్పంచ్ బుక్యా బుజ్జి, బొక్కలగుట్టలో సర్పంచ్ మాసు శ్రీనివాస్, సారంగపల్లిలో సర్పంచ్ బచ్చలి రాములు, శంకరపల్లిలో పెరుమాండ్ల వెంకటేష్, చిర్రకుంటలో రామటెంకి శ్రీలత, మామిడిగట్టులో సుంకరి దివ్య, ఆదిల్‌పేటలో నెండుగురి పున్నం, పొన్నారంలో పెంచాల మధు, వెంకటాపూర్‌లో సెగ్యం వెంకటేష్‌లు జాతీయ జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దేశభక్తి నినాదాలతో గ్రామపంచాయతీ ప్రాంగణాలు మార్మోగాయి. కార్యక్రమాల్లో ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, గ్రామ కార్యదర్శులు, సిబ్బంది, వివిధ సంఘాల ప్రతినిధులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సర్పంచులు మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకొని, వారి ఆశయాలకు అనుగుణంగా గ్రామాభివృద్ధి కోసం సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.



# జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన పలువురు ప్రముఖులు

## అలరించిన సాంస్కృతిక నృత్యాలు







**జనోదయ,హనుమకొండ, జనవరి 26:**

77వ భారత గణతంత్ర దినోత్సవ వేడుకలను ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా సోమవారం ఘనంగా నిర్వహించారు.

**హనుమకొండలో...**

హనుమకొండ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలోని పరేడ్ గ్రౌండ్ లో జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్, వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ పోలీసుల నుండి గౌరవ వందనం స్వీకరించారు. హనుమకొండ జిల్లాకు సంబంధించిన ప్రగతి నివేదికపై జిల్లా కలెక్టర్ ప్రసంగించారు. స్వాతంత్ర్య సమరయోధులను పూలమాలలు, శాలువాలతో కలెక్టర్ ఘనంగా సన్మానించారు. విధుల్లో ఉత్తమ సేవలకు గాను వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, సామాజిక సేవలు అందించిన పలువురికి కలెక్టర్ ప్రశంసా పత్రాలను అందజేశారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. డి ఆర్ డి ఏ, మెప్మా, మహిళా శిశు సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్య, టెస్కో, హౌజింగ్, వ్యవసాయ, ఉద్యాన, మత్స్య, పశుసంవర్ధక శాఖల ఆధ్వర్యంలో పరేడ్ గ్రౌండ్ లో స్టాల్స్ ను ఏర్పాటు చేయగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, సెంట్రల్ జోన్ డిసిపి ధార కవిత తిలకించారు. ఆయా స్టాల్స్ లో ఏర్పాటు చేసిన వస్తువులను గురించి సంబంధిత శాఖల అధికారులు జిల్లా కలెక్టర్ కు వివరించారు.

**డిసిసి కార్యాలయంలో...**

హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గణతంత్ర దినోత్సవ వేడుకలను ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజు, ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య తదితరులు పాల్గొన్నారు.

**జనగామ జిల్లా కలెక్టరేట్ లో...**

జనగామ జిల్లా కలెక్టరేట్ లో కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ జాతీయ జెండాని ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల గౌరవ వందనాలు స్వీకరించి జిల్లా అభివృద్ధిపై సందేశం ఇచ్చారు. ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, అధికారులు, ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

**వరంగల్ కలెక్టర్ ఆధ్వర్యంలో...**

భారత గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం వరంగల్ జిల్లా కేంద్రంలోని ఖిలా వరంగల్ ఖుష్మహల్ మైదానంలో ఘనంగా జరిగిన వేడుకలలో
జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద జాతీయ త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీసుల నుండి గౌరవ వందనం స్వీకరించారు.

**వరంగల్ నగర్ మేయర్ ఆధ్వర్యంలో...**

77 వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని హన్మకొండ లోగల పబ్లిక్ గార్డెన్ లో కమిషనర్ చాహత్ బాజ్ పాయ్,నగర మేయర్ గుండు సుధారాణి త్రివర్ణ పతాకాన్ని ఎగరవేశారు. కార్యక్రమంలో హార్టికల్చర్ ఇంజనీరింగ్ ఉన్నతాధికారులు, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.







# రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

**జనోదయ, మహబూబాబాద్, జనవరి 26**

- **అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు.**
- **సంక్షేమ పథకాల అమలులో దేశంలోనే ముందంజ**
- **మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**

దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో రైతును రాజు చేయాలనే ఉద్దేశంతోనే రైతులకు సంబంధించి రైతు బీమా, రైతు భరోసా, వివిధ సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి రైతు సంక్షేమమే ధ్యేయంగా అమలు చేస్తున్నామని రాష్ట్ర హౌసింగ్, రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం మహబూబాద్ జిల్లా కేంద్రంతో పాటు మరిపెడ, తొర్రూర్, వర్ధన్నపేటలలో మంత్రి పర్యటించారు. పలు కార్యక్రమాల పరిశీలన, ప్రారంభోత్సవాల అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు.

వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా దాదాపు మూడు కోట్ల వ్యయంతో మరిపెడ డివిజన్ నందు వ్యవసాయ పనిముట్లు పంపిణీ చేయడం జరిగిందని అన్నారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పథకం అందుకు నిదర్శనమని, దశలవారీగా అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకొనుటకు 5 లక్షల నగదు, రెండు పడకల గదుల నిర్మాణం చేపట్టి అందించడం జరుగుతుందన్నారు. ఈ నిర్మాణ పథకంలో ఆర్థిక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో స్వయం సహాయక బృందాలలో సభ్యులుగా ఉన్న మహిళలకు వడ్డీ లేని రుణాలను అందించి ఇల్లు నిర్మాణం కోసం ఇతర అవసరాల వ్యాపార అభివృద్ధి కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం జరిగిందని అన్నారు.

**తొర్రూరు పట్టణంలో...**

తొర్రూరు పట్టణంలో రెండు పడకల గదుల నిర్మాణం పూర్తి చేసుకున్న బ్లాకులను ఆయన సందర్శించారు. సాధ్యమైనంత త్వరగా లబ్ధిదారులకు అందించాలని అందుకు హౌసింగ్ అధికారులు రెవెన్యూ విభాగం సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మున్సిపల్ పట్టణ పరిధిలో సుమారు 15 కోట్ల వ్యయంతో అంతర్గత రోడ్ల నిర్మాణం డ్రైనేజీలు, విస్తరణ తదితర పనుల ప్రారంభోత్సవం కోసం భూమి పూజ శంకుస్థాపనలు చేయడం జరిగిందని, పట్టణాలు,గ్రామాలు అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించి అధిక నిధులు కేటాయించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మంత్రి వెంట ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్, పాలకుర్తి ఎమ్మెల్యే మామిండ్ల యశస్విని రెడ్డి, వరంగల్ పార్లమెంటు సభ్యురాలు కడియం కావ్య, జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్, అదనపు కలెక్టర్ రెవెన్యూ అనిల్ కుమార్, రెవెన్యూ డివిజనల్ అధికారి గణేష్, మున్సిపల్ కమిషనర్, వ్యవసాయ శాఖ అధికారిని సరిత, సంబంధిత విభాగాల అధికారులు పాల్గొన్నారు.



# శారీరక వ్యాయామానికివ క్రీడలు అవసరం

**జనోదయ మందమర్రి జనవరి 26:**

- **వెంకటాపూర్ సర్పంచ్ వెంకటేష్**

క్రీడలు శారీరక వ్యాయామా నికి,దేహ దారుఢ్యాన్ని పెంపొందించేందుకు దోహద పడతాయని ప్రతి ఒక్కరూ వారికి నచ్చిన క్రీడల్లో ప్రావీణ్యం సంపాదించి ఆరోగ్యాన్ని పెంపొందించు కోవాలని వెంకటాపూర్ గ్రామపంచాయతీ సర్పంచ్ సేగ్యం వెంకటేష్అన్నారు. రిపబ్లిక్ డే ఉత్సవాలను పురస్కరించుకొని సోమవారం గ్రామపంచాయతీ పరిధిలోని యువతకు నిర్వహించిన వాలీబాల్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. యువత సమాజంలో గౌరవపదమైన పాత్ర పోషించి అందరికీ ఆదర్శంగా ఉండాలని కోరారు. యువకులు చదువుతో పాటు వారికి నచ్చిన క్రీడల్లో తగిన ప్రావీణ్యం సంపాదించుకోని ఉత్తమ క్రీడాకారులుగా రాణించాలన్నారు. క్రీడల ద్వారా ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయని దీనిని సద్వినియోగం చేసుకొని వారి జీవితాలను ఉన్నతంగా తీర్చిదిద్దు కోవాలన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని ఓటమితో కృంగిపోకుండా గెలుపు కోసం పట్టుదలతో కృషి చేయాలని కోరారు. ఈ వాలీబాల్ పోటీలలో గ్రామానికి చెందిన ఐదు జట్లు తలపడగా మొదటి, రెండో స్థానం సాదించిన వేల్పుల సంతోష్, శ్రీనివాస్ టీంలు విజేతలుగా నిలువగా వారికి షీల్డ్స్, నగదు బహుమతులు, అందచేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సిద్ధుల రాజేశ్వరి, వార్డ్ సభ్యులు కాసిపేట అశోక్, మాసు సంతోష్,గ్రామస్థులు వేల్పుల సాగర్ తదితరులు పాల్గొన్నారు.



జనోదయ



# సింగరేణి ఆధ్వర్యంలో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు

**జనోదయ, మందమర్రి జనవరి 26:**

భారత దేశ 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను సోమవారం సింగరేణి ఆధ్వర్యంలో ఏరియాలోని జీఎం కార్యాలయం, గనులు, విభాగాలలో, ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా సింగరేణి అధికారులు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఏరియాలోని సింగరేణి ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించిన 77 వ గణతంత్ర దినోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏరియా జనరల్ మేనేజర్ రాధాకృష్ణ, ఏరియా సేవా అధ్యక్షురాలు ఎన్ శ్రీవాణి రాధాకృష్ణ లు విచ్చేసి, ముందుగా గాంధీజీ, బాబా సాహెబ్ అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి, ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఏరియా జీఎం ఎన్ రాధాకృష్ణ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏరియా ఎస్ అండ్ పిసి సిబ్బంది, రెస్క్యూ సిబ్బంది, సింగరేణి, పలు పాఠశాల విద్యార్థిని విద్యార్థులతో గౌరవ వందనం స్వీకరించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ, సింగరేణి ఉత్పత్తి, ఉత్పాదకత పై, కంపెనీ సంక్షేమాల గూర్చి ప్రసంగించారు. అనంతరం ఏరియాలోని 10 మంది ఉత్తమ ఉద్యోగులను, ఘనంగా సన్మానించారు. అదేవిధంగా కోల్ ఇండియా పోటీల్లో బంగారు పతకం సాధించిన నీలాల శ్రీనివాస్ బృందం సభ్యులకు బహుమతి ప్రధానం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థిని విద్యార్థులు, చేసిన నృత్యాలు అందరినీ అలరించాయి. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలలో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఎస్ఓటు జీఎం జీవిల్ ప్రసాద్, సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఏఐటియుసి బ్రాంచ్ కార్యదర్శి శైలేంద్ర సత్యనారాయణ, అధికారుల సంఘం సిఎంఓఏఐ ఏరియా అధ్యక్షుడు రమేష్, ఏరియా పర్సనల్ డిజిఎం అశోక్, ఏరియా ఇంజనీర్ ఈ అండ్ ఎం బాలాజీ భగవతి జ, సీనియర్ పర్సనల్ అధికారి సత్యనారాయణ, జీఎం కార్యాలయ అధికారులు, సిబ్బంది, అన్ని గనుల, విభాగాల అధికారులు, సంక్షేమ అధికారులు, కార్మికులు, యూనియన్ నాయకులు, పాఠశాలల విద్యార్థిని విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పుర ప్రజలు పాల్గొన్నారు.





# విశిష్ట సేవలకు గుర్తింపు

**జనోదయ:మంథని జనవరి 18:**

దేశ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో వారి వారి విభాగాలలో విశిష్ట అందించిన వారిని గుర్తించి, ప్రభుత్వం వారిని ప్రశంస పత్రాలు అందించి, సత్కరిస్తుంది. దేశ 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా జిల్లా కేంద్రమైన మంచిర్యాల పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో మండల తహశీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్(ఆర్ఐ)గా విధులు నిర్వహిస్తున్న రాథోడ్ గణపతి, పట్టణ పోలీస్ స్టేషన్ లో కానిస్టేబుల్ లుగా విధులు నిర్వహిస్తున్న నల్లూరి మహేష్,పట్టణ మున్సిపాలిటీ లో పారిశుద్ధ్య విభాగంలో విధులు నిర్వహిస్తున్న మేకల నరేష్, లు ఉత్తమ ఉద్యోగులుగా ఎంపిక చేసి వారికి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ప్రశంసా పత్రాలను అందచేసి అభినందించారు.

అవార్డులు అందుకున్న వారిని తహాసిల్దార్ సతీష్ కుమార్ శర్మ, నాయబ్ తహసీల్దార్ సంతోష్ , పట్టణ సిఐ పర్స రమేష్ , ఎస్ఐ గోపతి నరేష్, మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాయలింగు లు అభినందించారు.

### రామగుండం సిపి చే .....

దేశ 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో పట్టణ పోలీస్ స్టేషన్ లో అదనపు సబ్ ఇన్స్పెక్టర్(అదనపు ఎస్ఐ)గా విధులు నిర్వహిస్తున్న నూనె శ్రీనివాస్ విశిష్ట సేవలను గుర్తించి, రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆయనకు ప్రశంస పత్రం అందజేసి, అభినందించారు. ఈసందర్భంగా ఆయనకు మందమర్రి సిఐ పర్సా రమేష్, పట్టణ ఎస్ఐ గోపతి నరేష్, పోలీస్ సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.







# మేడారం జాతరకు ఆర్టీసీ బస్సులను ప్రారంభించిన ఎమ్మెల్యే

• **జనోదయ, బెల్లంపల్లి, జనవరి 26:**

బెల్లంపల్లి పట్టణం నుండి మేడారం జాతరకు ఆర్టీసీ ఏర్పాటుచేసిన ప్రత్యేక బస్సులను సోమవారం బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ లాంచనంగా ప్రారంభించారు. బెల్లంపల్లి కొత్త బస్టాండ్ నుండి 79 ప్రత్యేక బస్సులను జాతరకు కేటాయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గడ్డం వినోద్ మాట్లాడుతూ మేడారం జాతరకు వెళ్లే భక్తులకు ఇబ్బందులు లేకుండా తగిన సంఖ్యలో బస్సులను అందుబాటులో ఉంచామని చెప్పారు. జాతరకు వెళ్లే భక్తులు ఆర్టీసీ సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఆర్టీసీ బస్సు ప్రయాణం సురక్షితమని, మహిళా భక్తులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం వర్తిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, ఆర్టీసీ ఎండి రాజశేఖర్ తోపాటు ఆర్టీసీ అధికారులు, పలువురు నాయకులు, భక్తులు పాల్గొన్నారు.



# ఘనంగా 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు

**జనోదయ, గంగాధర | జనవరి 26 :**

దేశవ్యాప్తంగా 77వ భారత గణతంత్ర దినోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించగా, గంగాధర మండలంలోని అన్ని గ్రామపంచాయతీలు, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, రాజకీయ పార్టీల కార్యాలయాలు, పట్టణ ముఖ్య కూడళ్లలో జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో డి. రాము, తహసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ ఎ. రజిత, మండల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇన్‌చార్జి అజమాత్ అలీ, గంగాధర మండల పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ బి. వంశీ కృష్ణ, మండల విద్యాధికారి కార్యాలయంలో ఎంఈఓ ప్రభాకర్, వ్యవసాయ శాఖ కార్యాలయంలో వ్యవసాయాధికారి శ్రీనివాస్ జాతీయ జెండాలను ఆవిష్కరించారు.

### మండలంలోని గ్రామాల్లో...

మధురనగర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ వేముల భాస్కర్, గంగాధర గ్రామంలో సర్పంచ్ పడాల భాగ్యలక్ష్మి, లక్ష్మిదేవిపల్లి గ్రామంలో సర్పంచ్ బాసవేణి శ్రీనివాస్, బూరుగుపల్లి గ్రామంలో సర్పంచ్ దూలం కళ్యాణ్ కుమార్, లింగంపెల్లి గ్రామంలో సర్పంచ్ ఇటవేణి శ్రీనివాస్, సర్వరెడ్డిపల్లి గ్రామంలో సర్పంచ్ కరాబూజ తిరుపతి గౌడ్, చర్లపల్లి (ఆర్) గ్రామంలో సర్పంచ్ ఇట్టేపు కనుకయ్య, ర్యాలపల్లి గ్రామంలో సర్పంచ్ దానే అనసూర్య, కొండాయపల్లి గ్రామంలో సర్పంచ్ మల్యాల తిరుపతి (వినయ్ సాగర్) జాతీయ జెండాలను ఆవిష్కరించి గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేశభక్తి నినాదాలు మార్మోగగా, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.







# బూరుగుపల్లిలో సమ్మక్క–సారాలమ్మ మహాజాతర ఏర్పాట్ల పరిశీలన

**జనోదయ,జనోదయ గంగాధర 26:**గంగాధర మండలం బూరుగుపల్లి గ్రామంలో నిర్వహించనున్న సమ్మక్క-సారాలమ్మ మహాజాతరకు సంబంధించి ఏర్పాట్లను గంగాధర మండల ఎంపీడీవో డి.రాము, మండల తహసిల్దార్ ఎ. రజిత, గంగాధర మండల ఎస్ఐ వంశీకృష్ణ లు పరిశీలించారు. మహాజాతర సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం తదితర మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ఆలయ ప్రాంగణాన్ని శుభ్రపరచడంతో పాటు ప్రత్యేక అలంకరణలు చేపట్టినట్లు వెల్లడించారు. జాతరలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొననున్న నేపథ్యంలో శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు జాతర కమిటీ సభ్యులు తెలిపారు.